ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024
5
అనంతపురం





అనంతపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రైతాంగాన్ని ఆదుకోండి

తహశీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఎం ధర్నాలు

పంటలను సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. సోమవారం నాడు జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంటల సాగు చేసిన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలన్నారు. ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు.

వార్త 6లో



పార్లమెంట్‌కు పోటీ ఎవరు..?



◆ వైసిపికి తేలారు.. టిడిపిలో ఇంకా సందిగ్ధం ◆ స్పష్టతనివ్వని అధిష్టానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిధిలోని అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాలకు టిడిపి తరుపున అభ్యర్థులెవరన్నది చర్చ నడుస్తోంది. వైసిపి ఇప్పటికే రెండు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రెండు స్థానాలనూ బిసిలకే కేటాయించింది. టిడిపి ఇదే ఫార్ములాను పాటిస్తుందా లేక మార్పు చేస్తుందా అన్నది వేచిచూడాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి బిసిలకు కేటాయించగా, టిడిపి అనంతపురం పార్లమెంటు ఓసికి, హిందూపురం పార్లమెంటు బిసికి కేటాయించింది. ఈ రెండు చోట్లా టిడిపి ఓటమినే చవిచూసింది. ఈసారి ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థులుగా టిడిపి తరుపున ఎవరుంటారన్న దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్పులు చేపడుతుందా లేక గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన అభ్యర్థులనే మరోమారు బరిలో దింపుతుందా అన్న దానిపై స్పష్టత లేదు. 2019 ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందినప్పటి నుంచి టిడిపి అభ్యర్థులిద్దరూ పార్టీ కార్యక్రమాల్లోనూ అంత చురుగ్గా కనిపించలేదు. రాజకీయాలకు దూరంగా ఉంటూనే వస్తున్నారు. లోకేశ్ పాదయాత్ర సమయంలోనూ జెసి.పవన్‌కుమార్‌రెడ్డి జిల్లాలో కనిపించలేదన్న చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల సమయంలోనూ వారి కదలికలు కనిపించడం లేదు. దీంతో టిడిపి ఈసారి అభ్యర్థులను మార్పులు చేసే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తంది. వైసిపి అనుసరించిన బిసి ఫార్ములానే టిడిపి అనుసరిస్తుందన్న చర్చ నడుస్తోంది. అయితే ఈ మార్పుల్లో ఎవరిని అభ్యర్థులుగా ఖరారు చేస్తారన్నదే సర్వత్ర నడుస్తున్న చర్చ.

వైసిపి బిసిలకే ఇచ్చినప్పటికీ సామాజిక తరగతుల మార్పులు చేపట్టింది. 2019 ఎన్నికల్లో అనంతపురం పార్లమెంటు నుంచి బోయ సామాజిక తరగతికి చెందిన తలారి రంగయ్యను దింపింది. హిందూపురంలో కురుబ సామాజిక తరగతికి చెందిన గోరంట్ల మాధవ్‌ను బరిలో నిలిపింది. ఈసారి మాత్రం అనంతపురం పార్లమెంటుకు శంకర నారాయణను తీసుకొచ్చింది. హిందూపురం పార్లమెంటుకు కర్నాటకు చెందిన బోయ శాంతమ్మను సమన్వయకర్తగా నియమించింది. ఈ ఇద్దరూ ఆయా నియోజకవర్గం పరిధిలో జరిగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు. అసెంబ్లీ స్థానాలకు కూడా సగం స్థానాలకు అభ్యర్థులను వైసిపి ఖరారు చేసింది. కాని టిడిపి ఇంకా అభ్యర్థులు ఒక్కరినీ ప్రకటించలేదు. మార్పులు, చేర్పులు చేస్తుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. ఫిబ్రవరి నాలుగో తేదీన తొలి జాబితా విడుదల చేస్తుందని ప్రచారం నడుస్తోంది. అందులో అసెంబ్లీకి ప్రకటిస్తుందా లేక పార్లమెంటు కూడా ఉంటాయా అన్నది కూడా స్పష్టత లేదు. అభ్యర్థులను టిడిపి ఎప్పుడు ఖరారు చేస్తుందోనని ఆ పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి. ఒకవైపు అధికార వైసిపి అభ్యర్థులను ఖరారు చేసి జనంలోకి పోతుంటే టిడిపి ఇంకా ప్రకటించకపోవడంతో ఆశావహులు, అభ్యర్థుల్లోనూ అయోమయం నెలకొంది. ఎవరికి సీట్లు వస్తాయి.. ఎవరికి రావో తెలియక అధిష్టానం వైపు చూస్తున్నారు. త్వరగా అభ్యర్థులను ఖరారు చేయాలంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇటీవల బాహాటంగానే మాట్లాడటం కూడా చర్చనీయాంశమైంది.

అర్జీలకు వేగవంతంగా పరిష్కారం

కలెక్టర్ ఎం.గౌతమి




అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన గ్రీవెన్స్ అర్జీలను ఎలాంటి ఆలస్యం కాకుండా సకాలంలో వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు.ఆయా శాఖల అధికారులు దీనిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, సమగ్ర శిక్ష ఎపిసి వరప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, డిఎల్డిఒ ఓబులమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగుల జిల్లా జెఎసి నాయకులు



సమ్మె చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి కనీస వేతనాలు చెల్లించాలని సెర్ప్ ఉద్యోగుల జిల్లా జెఎసి కన్వీనర్లు బి.మల్లికార్జున, టి.రామానంద్, డి.నబీరసూల్, పి.మధూసూధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సెర్ప్ ఉద్యోగుల జేఏసి ఆధ్వర్యంలో ఉద్యోగులు విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట నిరవదిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసి కన్వీనర్‌లు మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో సెర్ప్ ఉద్యోగులుగా పని చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతంగా చేరువ చేస్తున్నామని తెలిపారు. నాలుగున్న సంవత్సరాలుగా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేసిందన్నారు. ఇప్పటికైనా స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేసి రూల్ ఆఫ్ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టి మృతి చెందిన ఉద్యోగుల కుటుంబికులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. అనంతరం స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల జేఏసి నాయకులు సుభద్రమ్మ, శ్రీరాములు, మద్దిలేటి, ఈశ్వరయ్య, రమేష్ రెడ్డి, అనితా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

స్పందించకుంటే ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

◆ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.పెద్దన్నగౌడ్ ◆ కలెక్టరేట్ వద్ద నిరసన



ధర్నాలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పెన్షనర్లకు న్యాయం చేయకుంటే వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చాటి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్న గౌడ్, శీలా జయరామప్పలు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్‌ల సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురం కలెక్టరేట్ ఎదుట సోమవారం నాడు ధర్నా నిర్వహించారు. పెన్షనర్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దనగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప నేతృత్వంలో నిర్వహించిన ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, జిల్లా జేఏసీ అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, నగర అధ్యక్షులు మనోహర్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసంహులు, రవీంద్ర, పిఆర్‌టియు పురుషోత్తం రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.అశోక్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామానాయక్, ఆర్ఐ జిల్లా అధ్యక్షులు హొన్నూరుప్ప మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెన్షనర్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్ మాట్లాడుతూ పెన్షనర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా తీరని అన్యాయం చేసిందన్నారు. పోరాడి సాధించుకున్న ఆర్థిక ప్రయోజనాలను ఒక్కోటి రద్దు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం 1వ తేదీన పింఛను ఇచ్చే పరిస్థితి లేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ పెన్షనర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లు రాజకీయ విమర్శలు చేసే స్థితికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణం అన్నారు. అనంతరం స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్‌ల సంఘం జిల్లా నాయకులు ఖలెందర్, రామకష్ణ, ప్రభాకర్, తిప్పన్న, మహమ్మద్, నారాయణ, రమేష్, రఘురామ్ దయాల్, చంద్రశేఖర్ రెడ్డి, క్రిష్టప్ప, వేణుగోపాల్, మధుసూదన్, ఎం.సావిత్రి దేవి వి.నాగరాజేశ్వరి పాల్గొన్నారు.

సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

డిఇఒ కార్యాలయం వద్ద విద్యార్థి సంఘాల ధర్నా



డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యాలయాన్ని బార్‌కేంద్రాలను తలపించేలా మద్యం, గంజాయి, గుట్కా ప్యాకెట్‌లను వినియోగిస్తూ విద్యార్థులను జీవితాలతో చెలగాటం ఆడుతున్న సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని సంస్థను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్డెన్ విజయశంకర్ విద్యా సంస్థలోనే మద్యం, గంజాయి, గుట్కా సేవిస్తూ విద్యార్థులను విచక్షణా రహితంగా మర్మాంగాలపై కొడుతూ చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని తెలిపారు. ఒక విద్యాలయంలో ఇంత పెద్ద ఎత్తున దాష్టికాలు జరుగుతుంటే విద్యా శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గంగా ఉందన్నారు. తక్షణమే సంసిద్ స్కూల్‌ను సీజ్ చేసి గుర్తింపును రద్దు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ స్పందన కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గిరి, సిద్ధు, సోము, భీమేష్, చందు, ఎఐఎస్ఎఫ్ నాయకులు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం నాయకులు-ఫర్టిలైజర్స్ దుకాణం ముందు ధర్నా



రేవతి ఫర్టిలైజర్స్ ముందు ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నకిలీ కలింగర విత్తనాలతో రైతులను మోసం చేసిన ఫర్టిలైజర్స్ దుకాణం నిర్వాహకులపై చర్యలు తీసుకుని బాధిత రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలోని పలువురు రైతులకు నాసిరకం కళింగర విత్తనాలు అందజేసిన నగరంలోని రేవతి ఫర్టిలైజర్స్ దుకాణం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో 8 మంది రైతులు 25 ఎకరాల్లో అప్పులు చేసి కలింగర పంట సాగు చేశారన్నారు. అయితే రేవతి పర్టిలైజర్స్ దుకాణం నిర్వాహకులు ఇచ్చిన నాసిరకం విత్తనాల కారణంగా పంట పూర్తిగా దెబ్బంతిందన్నారు. దీంతో రైతులు ఎకరాకు రూ.లక్ష చొప్పున నష్టపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో అప్పులు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి నాసిరకం విత్తనాలు అందజేసిన ఫర్టిలైజర్స్ దుకాణం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎడిఎ ఎం.రవి ఘటనా స్థలానికి చేరుకుని ఫర్టిలైజర్స్ దుకానంలోని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. త్వరలోనే రైతుల పొలాలను పరిశీలించి దుకాణం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, దళిత సంఘం నాయకులు ఆనంద్, బాధిత రైతులు వెంకటనారాయణరెడ్డి, మల్లేశ్వరమ్మ, లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, మల్లిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రంగారెడ్డి, కుళ్లాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఆర్ట్స్ కళాశాలలో 'మాక్ పార్లమెంట్'



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

యువత రాజకీయాల్లోకి రావాలని నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, జాతీయ యువ అవార్డు గ్రహీత బిసాటి భరత్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నెహ్రూ యువకేంద్రం మీటింగ్ హాల్‌లో మాక్ యూత్ పార్లమెంట్ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రజాపతినిధిగా మారి ప్రజల సమస్యలపై పోరాడాలన్నారు. ఉద్యోగాలే జీవిత ఆశయంగా కాకుండా రాజకీయం కూడా జీవిత ఆశయంగా పెట్టుకుని రాజకీయాల్లోకి ప్రజలకు సేవ చేయాలన్నారు. అనంతరం మాక్‌పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ, అనంతపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, జయమారుతి, ఆర్ట్స్ కళాశాల లెక్చరర్ అచ్చుతానంద, యువ నాయకులు రాజశేఖర్‌గౌడ్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నాడు 'చంద్రన్న బీమా'తో ధీమా.. నేటి 'వైఎస్ఆర్ బీమా' డొల్ల

సెల్ఫీ ఛాలెంజ్‌లో 'కాలవ'



'చంద్రన్న బీమా' లబ్ధిదారులతో సెల్ఫీ దిగుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

నిరుపేద కుటుంబాల్లో ఆకస్మిక మరణాలు సంభవించినప్పుడు ఆపన్నహస్తం వలే గతంలో 'చంద్రన్న బీమా' ఆర్థిక భరోసా కల్పించిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా కాలవ సోమవారం గుమ్మఘట్ట మండలం లోని కలుగోడు గ్రామంలో 'చంద్రన్న బీమా' లబ్ధిదారులతో 42వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. 2014-19 మధ్యకాలంలో జిల్లాలో ప్రమాదంలో, సహజంగా మృతి చెందిన వారి కుటుంబాలకు చంద్రబాబు ప్రభుత్వం రూ. 242.5 కోట్ల సాయం అందించిందన్నారు. సహజ మరణానికి రూ. 2 లక్షలు, ప్రమాద మరణానికి రూ. 5 లక్షలు చొప్పున అందించి టిడిపి ప్రభుత్వం ఆదుకుందన్నారు. తప్పుడు హామీలు, అబద్ధపు వాగ్దానాలతో అధికారం చేపట్టిన సిఎం జగన్ చంద్రన్న బీమాను, వైఎస్ఆర్ బీమాగా మార్చాడన్నారు. వైసిపి హయాంలో జిల్లాకు వైఎస్ఆర్ బీమా ద్వారా వచ్చింది రూ. 58 కోట్లు మాత్రమే అన్నారు. డి.హీరేహాళ్ మండలం సోమలాపురంలో పాతికేళ్ల యువకుడు కురుబ లేపాక్షి విద్యుదాఘాతంతో మరణిస్తే ఆ కుటుంబానికి ఇంతవరకూ వైఎస్ఆర్ బీమా సాయం అందలేదన్నారు. జగన్ పాలనలో అర్హులకు సైతం వైఎస్ఆర్ బీమా అందడం లేదని మండిపడ్డారు. నియోజకవర్గంలో 'చంద్రన్న బీమా' ద్వారా రూ. 12.6 కోట్లు అందించామన్నారు. గుమ్మఘట్ట మండ లం కలుగోడు గ్రామంలో పిడుగు పడి అయిదుగురు మరణిస్తే ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఇచ్చి ఆదుకున్నామని గుర్తు చేశారు. ఇలాంటి పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి టిడిపి-జనసేన కూటమి చాలా అవసరమని, అందరూ సైకిల్ గుర్తుపై ఓటువేసి టిడిపిని గెలిపించాలని కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

ప్రాక్టికల్స్ పేరుతో డబ్బులు వసూళ్లు

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన శ్రీచైతన్య, నారాయణ కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. దీన్ని అవకాశంగా తీసుకున్న చైతన్య నారాయణ కళాశాలల యజామాన్యాలు పరీక్షల్లో మార్కులు వేయించేందుకు ఇన్విజిలేటర్‌లకు డబ్బులు ఇవ్వాలంటూ విద్యార్థులతో డబ్బులు వసూలు చేస్తూ మానిక ఒత్తిడి గురి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో విద్యాశాఖ అధికారులకు సమస్యలపై చెప్పినప్పటికీ స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ పరిశీలించి సంబంధిత కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు, గిరి నగర అధ్యక్షుడు భీమేష్, సోము తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2023 ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.251 కోట్లు ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ఇన్సూరెన్స్ వెంటనే ప్రకటించాలన్నారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఎం.నాగమణి, మన్నిల రామాంజనేయులు, వై.వెంకటనారాయణ, నగర నాయకులు వరలక్ష్మి, మసూద్, నూరుల్లా, వెంకటేష్, మండల నాయకులు పుష్ప రాజ్, ఓబులయ్య, వెంకటరాముడు, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం రాప్తాడు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.పోతులయ్య, నాయకులు శ్రీరాములు, నారాయణ, సుబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, ఉరవకొండ కార్యదర్శి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండ, విడపనకల్లు మండల కేంద్రాల్లో ఉన్న తహశీల్దార్ కార్యాలయాల ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్లు శ్రీధర్‌మూర్తి, ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశెనగ, జొన్న, మొక్కజొన్న, పత్తి, కంది, ఆముదం, తదితర పంటలను సాగు చేసిన రైతులు వర్షాలు కురవకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. ముఖ్యంగా హెచ్ఎల్‌సి, హంద్రీనీవా, జిబిసి పరిధిలో సాగు చేసిన పంటలు కూడా పాలకుల నిర్లక్ష్యంగ కారణంగా ఎండిపోయాయన్నారు. ఈనేపథ్యంలో పంటలు సాగు చేసిన నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కూలీలకు ఉపాధి హామీ పథకం కింద అదనంగా పని కల్పించి రోజుకు రూ.600 వేతనం పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.వెంకటేశులు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

శింగనమల : పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ముందుగా బస్టాండ్ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చారు. అనంతరం తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, ఆంజనేయులు, శ్రీనివాసులు, ఓబులేసు, నల్లప్ప, లక్ష్మీనారాయణ, మునీంద్ర, వెంకటనారాయణ, కుళ్లాయిస్వామి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా నాయకులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ వరుస కరువులతో అప్పుల్లో కూరుకుపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల సభ్యులు ఈశ్వరయ్య, రైతుసంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం మండల కమిటీ సభ్యులు బాబాఫక్రుద్దీన్, బి.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. రైతు రుణాలను రీ షెడ్యూల్ చేసుకున్న వారందరికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని యూనియన్ బ్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన అన్ని పంటలూ దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. కావున వెంటనే రైతులకు రీ షెడ్యూల్ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు జయశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి , శిరీషా, బి.శ్రీనివాసులురెడ్డి, శివజ్యోతి, అరుణ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఆత్మకూరు : పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యక్షులు ఎం.శివశంకర, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి ఎం.రామయ్య, ఉపాధ్యక్షురాలు జయమ్మ, రైతుసంఘం మండల అధ్యక్షులు రాము, పెద్దన్న, వెంకట్‌రాముడు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పంటలను సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ నాయకురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు నష్టపరిహారం, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా మండల అధ్యక్షురాలు కవిత, సిఐటియు నాయకులు మురళి, తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం : పట్టణ శివారులోని బళ్లారి రోడ్డులో నరసింహస్వామి ఆలయ ఆర్చి సమీపంలో సోమవారం ఓ వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమలాపురం స్టేషన్ నుంచి రాయదు ర్గం స్టేషన్‌కు గూడ్స్ రైలు వస్తుండగా ఉదయం 8:20 గంటల సమయంలో నరసిం హస్వామి ఆలయ ఆర్చి సమీపంలో మల్లికార్జున రైలు పట్టాలపై పడ్డాడు. గమనించిన రైల్వే సిబ్బంది రైలును ఆపేశారు. ఇంతలో రైలు చక్రాలు అతడి మీదుగా వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. అతడిని అంబులెన్స్ లో రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం అతడిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై మల్లికార్జున భార్య గంగమ్మ మాట్లాడుతూ భర్త కుట్టు పని చేసేవాడని, మానసిక పరిస్థితి సరిగా లేదని తెలిపింది. కుటుంబానికి భారం కాకూడదనే ఉద్దేశంతో ఆత్మహత్యకు ప్రయత్నించాడన్నారు. వీరికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసు శివప్రసాద్ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి రెండిళ్లు నేలమట్టం -ఐదుగురికి గాయాలు



గ్యాస్ సిలిండర్ పేలి నేల మట్టమైన ఇల్లు

కుందుర్పి : మండల పరిధిలోని తెనగల్లు గ్రామంలో సోమవారం గ్యాస్ సిలిండర్లు పేలి రెండు ఇళ్లు నేటమట్టమయ్యాయి. గ్రామస్తులు, ఎస్ఐ తెలిపిన వివరాలు.. ముస్తాబ్ అనే ఓ వ్యాపారి ఇంట్లో ఉదయం గ్యాస్ సిలిండర్ పేలి పొగలు కమ్ముకున్నాయి. దీంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసే లోపే మరో సిలిండర్ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో పాటు ఇళ్లు కూలిపోయాయి. ఆ శిథిలాలు పెద్దఎత్తున ఎగిరిపడ్డాయి. మంటలు ఆర్పేందుకు వెళ్లిన స్థానికులు భీమరాజు, చౌడప్ప, నారాయణస్వామి, మారుతి, రామంజి, సిద్దేశ్వర గాయపడ్డారు. వారిఇలో భీమరాజు, చౌడప్పకు తీవ్ర గాయాలు కావడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరకుని మంటలను ఆర్పి వేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే కళ్యాణదుర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు గాయపడిన వ్యక్తులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం వల్ల తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఉమామహేశ్వరనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి కూడా బాధితులను పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందనే విష యంపై అన్ని కోణాల్లో పరిశీలిస్తూ దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

అనంతపురం : గుంటూరులో నిర్వహించిన ఓ నాటకంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో 7వ తరగతి సి.బ్యాచ్‌కు చెందిన ఎ.ముని, తన్వీష్, 9వ తరగతి చదువుతున్న ఎ.ముని, గ్రీష్మిత కలిసి గుంటూరులోని విజ్ఞాన మందిరంలో 'చెట్లు పచ్చదనానికి ప్రతీకలు' అనే నాటికను ప్రదర్శించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా చెట్లు వాతావరణ కాలుష్యాన్ని నియంత్రిస్తాయి కావున.. చెట్లను ఎవరూ నరకకుండా రక్షించుకోవాలి అనే నినాదంతో ఆడిన నాటకం అందరినీ ఆకట్టుకుని సినీ నటుడు పోసాని కృష్ణమురళి నంది అవార్డును బహూకరించినట్లు తెలిపారు. నాటకంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎజిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏవో గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం కమిషనర్‌గా బివి నర్సారెడ్డి



కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా బీవీ నర్సారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న నర్సారెడ్డిని కళ్యాణదుర్గం బదిలీ చేశారు. ఈయన గతంలో గుత్తి మున్సిపల్ కమిషనర్‌గా కూడా పని చేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు సత్కారం

రాయదుర్గం : రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి నుంచి ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు అందుకున్న స్థానిక ప్రభుత్వ ఖజానా శాఖ సీనియర్ సహాయకులు హనుమాన్‌జి, మండలం వనరుల కేంద్రం కంప్యూటర్ ఆపరేటర్ రామాంజనేయులును సోమవారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాల యంలో రాయదుర్గం, గుమ్మఘట్ట యుటిఎఫ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు రవికుమార్, హనుమంతురెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, నాగరాజు, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

రాయదుర్గం : గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గ స్థాయి పోటీలు ముగిసాయి. పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ముగింపు వేడుకలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ స్థాయిలో గెలిచి జిల్లా స్థాయికి వెళ్లిన క్రీడాకారులను ఆమె అభినందించారు. మొదటి, రెండు, మూడో స్థానంలో నిలిచిన వారికి మెడల్, చెక్కు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొండయ్య, ఎంఇఒ వెంకటరమేష్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలిబాషా, క్రీడల ప్రత్యేక అధికారి నాగరాజు, గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు గోవిందరాజులు, షబ్బీర్, కో ఆప్షన్ మెంబర్ నజీర్, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, నాయకులు శివ, శ్రీరామరెడ్డి, నిజాముద్దీన్, కృష్ణమూర్తి, బషీర్, సత్యనారాయణ, దివాకర్, పాఠశాల పీడీలు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగంగా రోడ్డు నిర్మాణం

వైసిపి నేత పరంధామరెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామంలో రైతులకు అనుగుణంగా మట్టి రోడ్డు వేశామని వైసిపి నాయకులు పరంధామరెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ నిధులు రూ.10లక్షలతో (1.25 కిలోమీటర్లు) రోడ్డు నిర్మాణానికి అధికారులు అంచనాలు వేశారన్నారు. రోడ్డు వేయడంతో దాదాపు 70 మంది రైతులకు సౌకర్యవంతంగా మారిందన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పంటలను సులభంగా ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా రోడ్డు పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. మట్టి రోడ్డు నిర్మాణంలో తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమన్నారు. ఈ విషయంపై విచారణకైనా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, దస్తగిరి, మాబు, దేవేంద్ర, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, బాషా, బాబయ్య, చిన్ననారాయణ, ప్రేమ్‌సుందర్‌రెడ్డి, గోవిందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నారాయణరెడ్డి, నాగేంద్ర, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మట్టి రోడ్డు వద్ద పొలాలకు వెళ్లే రైతులు

డ్రైయినేజీ పనుల పరిశీలన

నార్పల : మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట క్రాస్ నుంచి కూతలేరు వంక వరకూ రూ.40 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ కాలువ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రవీందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. మెయిన్ రోడ్డులో కాలువ నిర్మాణం పటిష్టంగా ఉండాలని గుత్తేదారులకు సూచించారు. అలాగే నాణ్యతలో రాజీ పడవద్దన్నారు.

బదిలీ ఎంపిడిఒకు సన్మానం

పుట్లూరు : ఎన్నికల నేపథ్యంలో కడప జిల్లాకు బదిలీ అయిన స్థానిక ఎంపిడిఒ యోగానం దరెడ్డిని సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయ ంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమ లో మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సేవకు సత్కారం

అనంతపురం : కనగానపల్లి మండలం తగరకుంట తండాకు చెందిన కొర్ర రెడ్యానాయక్ చేస్తున్న సేవలకు సత్కారం లభించింది. ఈనెల 26న విజయవాడలో జనసేవ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో రెడ్యానాయక్ బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నారు. దీంతో జిల్లాలోని పలువురు రెడ్యానాయక్‌ను అభినందించారు.

ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా సాకే భాస్కర్

ఉరవకొండ : ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా సాకే భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్‌గా బి.హనుమప్ప ఎన్నికయ్యారు. అనంతపురంలో నిర్వహించిన ఎపిటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. తమ ఎన్నిక సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

షర్మిలను కలిసిన కురుబలు

శింగనమల : జిల్లాకు మొట్టమొదటిసారిగా విచ్చేసిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు జిల్లా ఓబీసీ విభాగం తరపున కురుబ, గొల్లల సమక్షంలో కంబడి, గొర్రెపిల్లను బహూకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఛైర్మన్ రామ్‌చరణ్‌యాదవ్, జిల్లా ఓబీసీ వైస్‌ఛైర్మన్ బండి రామాంజనేయులు, బుక్కరాయసముద్రం మండల కన్వీనర్ మాడిశెట్టి సురేష్, ఉరవకొండ ఓబీసీ నాయకులు బ్యాళ్ల శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు చూపించాలని వినతి

ఉరవకొండ : ఉరవకొండలో హామీపత్రా లు పొందిన లబ్ధిదారులందరికీ ఇళ్లస్థలాలు చూపించి పట్టాలు మంజూరు చేయాలని వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్ కోరారు. ఈమేరకు హామీ పత్రాలు పొందిన లబ్ధిదారులతో కలిసి సోమవారం స్థానిక తహ శీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండలో దాదాపు 3000 మందికి ఇండ్ల పట్టాల పంపిణీ చేశారన్నారు. అయితే కోర్టులో పెండింగ్ ఉన్న దాదాపు 500 పైచిలుకు లబ్ధిదారులకు జగనన్న హామీ పత్రాలు పంపిణీ చేశారన్నారు. అయితే రెండు విడుతలుగా 50 0 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. పట్టాల పంపిణీలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయ న్నారు. ఇప్పటివరకు ఎంతమందికి పంపిణీ చేశారు.. ఎంతమందికి ఇవ్వలేదో.. తదితర వివరాలను సచివాల యాల్లో పొందుపరచాలన్నారు. వెంటనే అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరానగర్ వెంకటేశులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు

రాయదుర్గం : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం డ్రైవర్లకు డాక్టర్ మురళీకృష్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మోటార్ వాహనాల తనిఖీ అధికారిణి కె.అతికనాజ్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎసి శ్రీనివాసులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న 'మెట్టు'

రాయదుర్గం : ఎపిఐఐసి ఛైర్మన్, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సోమవా రం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు మిత్రులు, సన్నిహితులు ఉన్నారు.

సాంకేతిక వస్త్రాల అభివృద్ధికి ప్రభుత్వాల కృషి



నేషనల్ కాన్ఫిరెన్స్‌కు హాజరైన రాయదుర్గం రెడీమెడ్ గార్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

సాంకేతిక వస్త్రాల అభివృద్ధికి ప్రభుత్వాలు విధాన మార్గాలు రూపొందించాయని రాయదుర్గం రెడీమేడ్ గార్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు తెలిపారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం జరిగిన టెక్స్‌టైల్స్ సెమినార్‌లో పాల్గొనేందుకు రాయదుర్గం రెడీమేడ్ గార్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు 20 మందికి అవకాశం లభించిందని ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక వస్త్రాల అభివృద్ధికి సంబంధించి భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ సంయుక్తంగా జాతీయ సమావేశం (నేషనల్ కాన్ఫరెన్స్) నిర్వహించారన్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత హాజరై ఫైబర్ టెక్నాలజీతో దారం తయారు చేసే అంశంపై ప్రసంగించారన్నారు. భవిష్యత్తులో తక్కువ వ్యయంతో నాణ్యత కలిగిన ఫైబర్ దారం వాడటం వల్ల గార్మెంట్స్ పరిశ్రమ మరింత వృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయదు ర్గం రెడీమేడ్, గార్మెంట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కెబి.మురళి, కార్యదర్శి శ్రీనివాసులు, క్యాషియర్ వెంకటేశులు, సభ్యులు ఎంఎస్.నాగరాజు, దబ్బడి గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పివికెకెలో 'స్వాధ్యాయ-2024' ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రుద్రంపేట వద్ద ఉన్న పివికెకె డిప్లొమా కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'స్వాధ్యాయ-2024' జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్కెయు ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ ఎ.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక అభిలాష, అన్వేషణా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడ తాయన్నారు. శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా శాస్త్ర సాంకేతికతను కొత్త పుంతలు తొక్కించాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా బయోగ్యాస్ ప్లాంట్, మురుగునీటి శుద్ధి ప్లాంట్, ఆటోమేటిక్ డ్రిప్ ఇరిగేషన్‌తోపాటు మెకానికల్ వాషింగ్‌మిషన్, ఆల్ ఇన్ వన్ ఫ్లోర్ క్లీనర్, అల్ట్రా సైన్ బ్రోకింగ్ సిస్టం, హైడ్రాలిక్ కార్ పార్కింగ్, మినీ ఎయిర్ కూలర్, డిస్టెన్స్ మీటర్, నియో లైట్ ద్వారా వైఫై ఎలా నియంత్రించ బడుతుంది, ఫైర్ కంట్రోల్ రోబోట్, స్మార్ట్ డోన్ తదితర నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్లొమా కళాశాల పిన్సిపాల్ జిఎస్ఎస్.వైభవ్, యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత రెడ్డి, అకడమిక్ డీన్ వై.సంతోష్ కుమార్‌రెడ్డి, ఎస్‌బిఎల్‌టి కళాశాల పిన్సిపల్ సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఇ.ఎం.అనురా గ్‌రెడ్డి, 3000 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.



నమూనాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, పివికెకె ఛైర్మన్ పల్లె వెంకటకృష్ణకిషోర్

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-పుట్లూరు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. సోమవారం ఉదయం యల్లనూరు మండలంలోని సింగవరం, కొత్తపల్లి గ్రామ పొలాల్లో మిర్చి, టమెటా, చీనీ రైతులు, కూలీలతో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక రైతుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నట్లు నిత్యం దినపత్రికల్లో వార్తలను చదువుతూనే ఉన్నామన్నారు. ముఖ్యంగా రైతు ప్రభుత్వమని చెప్పుకునే వైసిపి నాయకులు రైతులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాలు కురవక, మరోవైపు ప్రభుత్వం నుంచి బీమా, పరిహారం అందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఈనేపథ్యంలో రైతులను ఆదుకోవాలంటే టిడిపిని అధికారంలోకి తెచ్చుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం టిడిపి అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాల కరపత్రాలను అందజేశారు.



కూలీలతో మాట్లాడుతున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

అగ్ని ప్రమాదంపై స్పందించని అధికారులు

ఆదుకోవాలని బాధితురాలి వేడుకోలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని బుడిమేపల్లి గ్రామంలో ఈ నెల 26వ తేదీ రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుని ఓ హోటల్‌లో దగ్ధమైంది. గ్రామస్తులు, హోటల్ నిర్వాహకురాలు అంజనమ్మ తెలిపిన వివరాలు.. అంజనమ్మ హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. ఈ నెల 26వ తేదీ హోటల్ ను మూసి వేసి పక్కనే ఉన్న తన సొంతింటిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు హోటల్‌కు నిప్పు పెట్టారు. మంటలు చెలరేగడంతో అంజనమ్మతో పాటు చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆర్పి వేశారు. ప్రమాదంలో హోటల్ సామగ్రి, నిత్యావసర సరుకులు, రిఫ్రిజిరేటర్, తదితర సామగ్రి పూర్తిగా కాలి బూడిదైంది. సంఘటన జరిగిన ఆ సమయంలోనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు పేర్కొంది. ఫిర్యాదు ఇచ్చి నాలుగు రోజులైనా రెవెన్యూ శాఖ అధికారులు కానీ పోలీస్ శాఖ వారు కానీ సంఘటనా స్థలాన్ని సందర్శించలేదని బాధితురాలు వాపోతుంది. ప్రమాదంలో రూ. లక్ష ఆస్తి నష్టం జరిగిందని, సంబంధిత అధికారులు స్పందించి అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని, ప్రభుత్వం తరపున ఆదుకోవాలని బాధితురాలు అంజనమ్మతో పాటు కుటుంబ సభ్యులు పెన్నోబులేసు, ఎర్రిస్వామి, రాజు కోరుతున్నారు.

విత్తన నాణ్యతపై అధికారులకు శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌లో సోమవారం విత్తన నాణ్యతపై వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా విత్తనాల మొలక శాతం, విత్తనాల నాణ్యత, పరీక్షలపై అగ్రీ టెస్ట్ ల్యాబ్‌కు ఎంపికైన వ్యవసాయ అధికారులకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు విత్తన పరీక్ష కేంద్రం నుంచి సహాయ వ్యవసాయ సంచాలకులు శైలకుమారి, అనంతపురం ఎరువుల పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు హేమావతి, తాడిపత్రి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు చెంగల్‌రాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో నార్పల మండల వ్యవసాయ అధికారి సి.చెన్నవీరస్వామి, ధర్మవరం, తాడిపత్రి, నంద్యాల జిల్లా పాణ్యం, తిరుపతి జిల్లా మదనపల్లికి చెందిన అగ్రీ ల్యాబ్ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద సర్పంచుల నిరసన

శింగనమల : సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఈనెల 30న కలెక్టరేట్ ముందు ధర్నా చౌక్‌లో నిరసన వ్యక్తం చేయనున్నట్లు పంచాయతీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డేగల క్రిష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాలకు అతీతంగా జిల్లాలోని సర్పంచులు, ఎంపిటిసిలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వ్యాసరచన పోటీలు

అనంతపురం : నగరంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం బ్రాంచ్-7లో ప్రిన్సిపాల్ పర్వీన్ మేడం అధ్యక్షతన డయాబెటిస్ అవేర్నెస్‌లో భాగంగా సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలకు డయాబెటిస్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మొదటి బహుమతి 3, 2వ బహుమతి 3, 3వ బహుమతి నలుగురు విద్యార్థులు సాధించారు. బహుమతులు పొందిన విద్యార్థులకు ఎజిఎం సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ చంద్రమోహన్‌పాల్గొన్నారు.

గుంతకల్లు కమిషనర్‌గా వెంకట రమణయ్య



గుంతకల్లు : మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రొద్దుటూరులో బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకట రమణయ్యను గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వి.మల్లికార్జునను ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇబ్బంది సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేడు పుట్లూరుకు ఎమ్మెల్యే రాక

పుట్లూరు : మండల పరిధిలోని సచివాలయ, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మంగళవారం రానున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు మండలంలోని మడుగుపల్లి, ఎల్లుట్లలో డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

కళ్యాణదుర్గం : నియోజకవర్గ పరిధిలో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఆర్‌పిఎస్ తాలూకా అధ్యక్షులు చెలిమప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం దళిత నాయకులతో కలిసి ఆర్డీవో రాణీసుష్మితకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో గత కొంతకాలంగా నెలకొన్న భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి

పామిడి : స్థానిక ప్రజాప్రతినిధులను అధికారులు సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి బోగాతి మురళీమోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, ఆర్‌డబ్ల్యుఎస్, ఉపాధి హామీ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య, విద్యుత్, పశు వైద్యశాఖ అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం రామగిరి ఎంపిటిసి మజ్జిగ రాజశేఖర్ మాట్లాడుతూ మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు ముఖ్యమైన శాఖల అధికారులు రాకపోవడంతో సమావేశాలు ఎందుకని మండిపడ్డారు. వైస్‌ఎంపిపి కాయల మహేష్ మాట్లాడుతూ మండలంలో అనేక చోట్ల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులకు పిలుపు లేకుండా చేస్తున్నారన్నారు. అలా చేయడం తగదన్నారు. ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం చేయాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.